
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

ఆదివారం 3 ఆగస్టు 2025

రుంజ దరువు.. ఆదరణ కరువు

అంతరించిపోతున్న ప్రాచీన వాయిద్యం

- కళకు అంకితమైన ఏకైక కుటుంబం
- తరతరాలుగా వాయిస్తుండడంతో వదులుకోలేక కొనసాగింపు
- ప్రభుత్వం ప్రోత్సహించాలని వేడుకోలు

7



విశ్వంలో అతి ప్రాచీనమైన వాయిద్యంగా, భూమ్మీద ఆవిర్భవించిన మొదటి మంగళ వాయిద్యంగా పేరుపొందినది రుంజ. కానీ నేడు ఆదరణ కరువై మూగబోతున్నది. శుభకార్యాలు, వివాహాలు, ఆలయ ప్రతిష్ఠాపనలు, బోనాల వంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఈ వాయిద్యం వినిపిస్తోంది. ఈ కళనే నమ్ముకుని జీవిస్తున్న కళాకారుల జీవితాలు దీనంగా మారాయి. ప్రభుత్వం ప్రోత్సహిస్తేనే మళ్లీ జీవం వస్తుందని వాయిద్యకారులు వేడుకుంటున్నారు.

భోజన మెనునూ కచ్చితంగా పాటించాలి

● కలెక్టర్ హైమావతి

కొమురవెల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన మెనునూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ హైమావతి ఉపాధ్యాయులకు సూచించారు. కొమురవెల్లి మండల కేంద్రంలో కలెక్టర్ హైమావతి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. మొదటగా గొర్రెలకు, మేకలకు వేస్తున్న టీకాలను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కూర అందించాల్సి ఉండగా వంకాయ కూర, పచ్చిపులుసు అందించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి తొందరగా పూర్తి చేసుకోవాలని నిర్మాణ దశల ఆధారంగా ఫొటోలు తీసుకుని ప్రభుత్వం లబ్ధిదారుల అకౌంట్లో డబ్బు జమ చేస్తుందని తెలిపారు. అనంతరం అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సేల్స్ రిజిస్టర్‌ను పరిశీలించి రైతులకు భూమి విస్తీర్ణం ప్రకారమే ఎరువులు అందజేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏంపీడీవో శ్రీనివాసవర్మ, పలువురు అధికారులు ఉన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ గరీమాఅగ్రవాల్

సిద్దిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమాఅగ్రవాల్ సూచించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని 9, 13 వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి ఆమె ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. అనంతరం కేసీఆర్‌నగర్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కేసీఆర్‌నగర్‌లోని గ్రంథాలయాన్ని సందర్శించారు.

హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో బయోటెక్నాలజీ కోర్సు

హుస్నాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటైన శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని హుస్నాబాద్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ బయోటెక్నాలజీ కోర్సును ప్రవేశపెడుతూ తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ శ్రీరామ్ వెంకటేశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశపెడుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సులుండగా బీటెక్ బయోటెక్నాలజీ కోర్సును ప్రవేశపెడుతున్నారు.



కోమటిచెరువులో పనిచేయని మ్యూజికల్ ఫౌంటైన్

కోమటిచెరువు కళావిహీనం


వీకెండ్ వచ్చిందంటే చాలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా హైదరాబాద్‌తో సహా ఇతర జిల్లాల నుంచి కూడా వేలాది మంది సందర్శకులు సిద్దిపేట కోమటి చెరువు అందాలను చూడటానికి వస్తుంటారు. అలాంటి చెరువు నిర్వహణ లోపాలతో పర్యాటకులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఇక్కడికి వచ్చిన సందర్శకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

- పనిచేయని సస్పెన్షన్ బ్రిడ్జి లైట్లు, మ్యూజికల్ ఫౌంటైన్
- మూతపడిన డైనోసార్ పార్కు
- సందర్శకుల అసహనం

సిద్దిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సందర్శకులను ఆకర్షించేలా ఏర్పాటు చేసిన సస్పెన్షన్ బ్రిడ్జి లైట్లు వెలగకపోవడం, మ్యూజికల్ ఫౌంటైన్ పనిచేయకపోవడం, డైనోసార్ పార్కు మూతపడడం వంటి సమస్యలు ఇప్పుడు కోమటి చెరువును పర్యాటకులకు దూరం చేస్తున్నాయి. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఈ పర్యాటక ప్రాంతం నిర్వహణ లోపాలతో కళావిహీనంగా మారింది. ఇక్కడికి వచ్చిన సందర్శకులు అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మూలన పడిన మ్యూజికల్ ఫౌంటైన్

రాష్ట్రంలోనే మొదటిసారిగా సిద్దిపేట కోమటిచెరువులో ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటైన్ కొన్ని నెలలుగా మూతబడింది. గతంలో ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు ఇక్కడ నిర్వహించే లేజర్ షో ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించేది. అంతేకాకుండా డైనోసార్లను నిజంగా చూస్తున్నట్లుగా అనిపించేలా ఏర్పాటు చేసిన డైనోసార్ పార్కు కూడా మూసివేశారు. ఆ పార్కులో ఆరుగురు పట్టేలా చిన్నపాటి రైలును ఏర్పాటు చేయగా, రైలు వెళ్తున్న సమయంలో చిన్న, పెద్ద డైనోసార్ బొమ్మలు చూస్తూ చిన్నాపెద్ద సరదాగా గడిపేవారు. గత కొన్ని రోజులుగా అవి కాస్త రిపేర్ల సమస్యలతో మూతపడింది. దీంతో ఇక్కడికి వచ్చిన సందర్శకులు నిరాశ చెందుతున్నారు.



అంధకారంలో సస్పెన్షన్ బ్రిడ్జి, నైట్ గార్డెన్


200 మీటర్ల పొడవున్న సస్పెన్షన్ బ్రిడ్జి గతంలో రాత్రి పూట రంగుల లైట్లతో మెరిసిపోయేది. ఇప్పుడు ఆ లైట్లు పాడైపోవడంతో వంతెన అంధకారంలో మునిగిపోయింది. నైట్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కూడా పనిచేయకపోవడంతో రాత్రిపూట కోమటిచెరువు కళతప్పి కనిపిస్తోంది. పర్యాటక శాఖ అధికారులు వీటిని పట్టించుకోవడం లేదని సందర్శకులు ఆరోపిస్తున్నారు.

పవర్ కంట్రోల్ పరికరాలు లేక..

రెండు నెలల క్రితం పిడుగు

మిగతా 8వ పేజీలో

మూసివేసిన డైనోసార్ పార్క్



డ్రగ్‌స్టోర్‌లో మందులను క్రమబద్ధంగా పెట్టుకోవాలి : డీఎంహెచ్‌వో

సిద్దిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో క్రమబద్ధంగా మందులను పెట్టుకోవాలని సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ధన్‌రాజ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన శనివారం టీ హబ్‌ను సందర్శించారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి వివిధ పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఏఎన్ఎం పరీక్షల నిర్వహణను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌ను సందర్శించి, మందుల నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట హబ్ మేనేజర్ అనిల్, వెంకటేశ్వర్లు ఫార్మసీ అధికారులు ఉన్నారు.

ప్రియురాలితో అసభ్యంగా ప్రవర్తించాడని హత్య

7





గజ్వేల్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కోమటిబండ వద్ద రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- గజ్వేల్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య క్రెడిట్ ఫైట్
- తమ పార్టీ అధినేతల వల్లే సమస్య తీరిందని వాదన
- క్షీరాభిషేకాలు, పరస్పర విమర్శలతో వేడి

వాటర్ హీట్

గజ్వేల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మల్లన్నసాగర్ నుంచి తాగునీరు అందుబాటులోకి రావడంతో గజ్వేల్‌లో ఈ ఘనత కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ పోరు మొదలైంది. మల్లన్నసాగర్ నుంచి నీటిని శుద్ధి చేసి, ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా గజ్వేల్‌కు తరలించడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని ఇరు పార్టీలు తమ గొప్పగా చెప్పుకుంటున్నాయి.

క్షీరాభిషేకాలు, వాదనలు

శనివారం ఇరు పార్టీల నాయకులు క్షీరాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ.1410 కోట్లతో భారీ నీటి జలాశయాన్ని నిర్మించి, రూ.1210 కోట్లతో మిషన్ భగీరథ పనులు పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. గజ్వేల్‌తో పాటు పలు జిల్లాలకు తాగునీటి సమస్యను దూరం చేసింది తమ అధినేత కేసీఆర్ అని ఆయన పేర్కొన్నారు. 75 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో గజ్వేల్, దుబ్బాక ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోయారని, సమస్యను పరిష్కరించలేకపోయారని

మిగతా 8వ పేజీలో

మొక్కలు నాటి.. శ్రమదానం చేసి

జనహితం సక్సెస్

అందోలు నియోజకవర్గంలో ముగిసిన కాంగ్రెస్ నేతల పాదయాత్ర

- రెండో రోజు విస్తృతంగా కార్యక్రమాలు
- శ్రమదానం, కార్యకర్తల సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం



సమావేశానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు, స్థానిక నాయకులు

జోగిపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రెండు రోజుల జనహిత పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం కాంగ్రెస్ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపింది. ముగింపు సందర్భంగా శనివారం పట్టణంలో నిర్వహించిన పాదయాత్ర, ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాలు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భారీగా పాల్గొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జోగిపేటలో నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి శ్రమదానం చేసి మొక్కలు నాటారు. విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు రాజకీయాల్లోకి కూడా రావాలని మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. యువత, ముఖ్యంగా మహిళలు రాజకీయాలపై ఆసక్తి చూపాలని సూచించారు. తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లిష్ భాషలపై కూడా పట్టు సాధించాలని ఆమె విద్యార్థులకు తెలిపారు. అనంతరం సంగుపేట సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. రెండో రోజు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో నాయకులు కార్యకర్తలకు ఇచ్చిన భరోసా వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



మాట్లాడుతున్న ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

పథకాలపై అవగాహన కల్పించాలి

ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

మిగతా 7వ పేజీలో

జీవన ప్రమాణాలు మెరుగవడమే అభివృద్ధి

జాతీయ స్థాయిలో సిద్దిపేట మెరవడం సంతోషం : హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి అంటే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో శనివారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అస్మిత యోగాసన సిటీ లీగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగ ద్వారా ఒత్తిడిలను జయించవచ్చని సూచించారు. అస్మిత కార్యక్రమ నిర్వహణతో జాతీయస్థాయిలో సిద్దిపేట భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడ తోట అశోక్ మాట్లాడుతూ దేశంలో 50 పట్టణాలు అస్మిత యోగా పోటీలకు ఎంపిక కాగా, సిద్దిపేట అందులో ఒకటి కావడం గర్వకారణం అన్నారు. ఈ సమావేశంలో అస్మిత లీగ్ డైరెక్టర్ తోట సంధ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల, వైస్‌చైర్మన్ కనకరాజు, సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు పాల సాయిరాం, రాష్ట్ర యోగ అధ్యయన పరిషత్తు సభ్యులు, ప్రముఖ యోగా గురువు తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్‌లోని ఓ పాఠశాలలో శనివారం ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- జగదేవ్‌పూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి)

ఇంటి పన్నుకు పింఛన్ వసూలు

పోతిరెడ్డిపల్లిలో పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదులు

చేర్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పింఛన్ డబ్బుల నుంచి గ్రామ పంచాయతీ పన్నులు వసూలు చేస్తున్న ఘటన చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామ పంచాయతీ కార్యదర్శి రజిత పింఛన్ పంపిణీ సమయంలోనే ఇంటి పన్నులు వసూలు చేయడం వివాదాస్పదంగా మారింది. గతంలో గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద పింఛన్లు పంపిణీ చేయగా, ఇప్పుడు గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే పంపిణీ చేస్తూ బలవంతంగా పన్నులు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. నడవలేని దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వాల్సినప్పటికీ, కార్యాలయానికి రమ్మని చెప్పి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు వాపోతున్నారు.

అధికారులకు ఫిర్యాదు

ఈ విషయంపై ఎంపీవో మహబూబ్ అలీకి ఫిర్యాదు చేసినా, శనివారం కూడా పన్నులు వసూలు చేశారని స్థానికులు తెలిపారు. అంతేకాకుండా వసూలు చేసిన పన్ను డబ్బులను ట్రెజరీలో జమ చేయకపోవడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి రజిత స్పందిస్తూ "నేను ఎవరినీ బలవంతం చేయలేదు, ఇష్టపూర్వకంగా ఇచ్చిన వారి నుంచే పన్నులు వసూలు చేశాను. ఆ మొత్తాన్ని సోమవారం ట్రెజరీలో జమ చేస్తాను" అని వివరణ ఇచ్చారు.

నిరసనగా పింఛన్ సరెండర్

ఈ విషయంలో దివ్యాంగుడైన బట్టు మోహన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దివ్యాంగులమని కూడా కనీసం గుర్తించడం లేదని, తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందారు. పంచాయతీ కార్యదర్శి రజిత వైఖరికి నిరసనగా వచ్చే నెల తన పింఛన్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోవా మద్యం పట్టివేత

మునిపల్లి /పటాన్‌చెరు ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి హైదరాబాద్ తరలిస్తున్న మద్యాన్ని శనివారం మునిపల్లి పోలీసులు పట్టున్నారు. మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేయగా 5.250 లీటర్ల గోవా మద్యం లభించింది. పటాన్‌చెరులో పోలీసులు కిలో ఎండు గంజాయి పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

అంగన్‌వాడీల్లో ఆట పాటలు

రామయంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక విద్య, అంగన్‌వాడీల బలోపేతం దిశగా కృషి జరుగుతోందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. రామాయంపేట మండల పరిధి దంతేపల్లి, కిషన్ తండా గ్రామపంచాయతీల్లో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మొదట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాటామంతి కలిపారు. పాఠాలు బోధించారు. పుస్తకాలు చదివిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు ఆట పాటలు నేర్పాలని ఈ సందర్భంగా నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. పిదప ఫ్రైడే ఫ్రైడే సందర్భంగా పలు వీధుల్లో తిరిగి నీటి కుళాయిలు, పాడుబడ్డ పశువుల తొట్లు చూశారు. ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రత పై జాగ్రత్తలు పాటించాలని సంబంధిత కార్యదర్శులను కలెక్టర్ ఆదేశించారు. కిషన్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.



దంతేపల్లిలో అంగన్‌వాడీ పిల్లలతో చదివిస్తున్న మెదక్ కలెక్టర్

కాంగ్రెస్.. బీఆర్ఎస్ బాహాబాహీ

హత్నూర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హత్నూరలో కల్యాణలక్ష్మి చెక్కులు, రేషన్ కార్డుల పంపిణీ రసాభాసగా మారింది. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసేందుకు ప్రయత్నించారు. బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు నినాదాలు, ప్రతినినాదాలు చేస్తూ తోసుకున్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని కొందరు చించేశారు. పోలీసులు నచ్చజెప్పినా, వినకపోవడంతో ఇరు పార్టీల నాయకులను బయటకు నెట్టివేశారు. అనంతరం ఈ ఘటనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చిత్రపటాన్ని కాంగ్రెస్ నాయకులే చించేసి తమపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. సీఎం చిత్రపటాన్ని చించేసిన బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు.



బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట

విగ్రహ దొంగల అరెస్టు

మెదక్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వినాయకుడి విగ్రహాన్ని దొంగలించిన నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. శనివారం పట్టణస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెల 27న మెదక్‌లోని చంద్రభవన్ కాంప్లెక్స్ నుంచి వాహనంలో వినాయకుడి విగ్రహాన్ని దొంగలించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. ఈ ఘటన విగ్రహ తయారుదారుడు సురేష్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మీర్‌పేటకు చెందిన కృష్ణకుమార్ మెదక్‌లోని అత్తగారి ఇంటికి తరుచూ వస్తుంటాడు. ఈక్రమంలో కృష్ణకుమార్ తన స్నేహితులైన హయత్ నగర్‌కు చెందిన నాగరాజు, తరుణ్, మహేష్, రాముతో కలిసి అద్దెకు ఆటో మాట్లాడుకుని కాంప్లెక్స్‌లో విక్రయానికి బయట ఉంచిన వినాయకుడి విగ్రహాన్ని దొంగలించారు. నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తలించారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. నలుగురి నిందితులపై దొంగతనం, గంజాయి కేసులు ఉన్నాయి. మత్తు పదార్థాలకు బానిసై ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారని అదనపు ఎస్పీ వెల్లడించారు.

రెండు దుకాణాలల్లో చోరీ

దుబ్బాక, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలోని రెండు దుకాణాలల్లో శనివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడి, 10 మొబైల్స్‌తో పాటు, 15వేల నగదును దొంగలించారు. పట్టణంలోని అంగడిబజారులో గల దుకాణ సముదాయంలోని ఎండీ గౌస్ మొబైల్ దుకాణం, ఉదయ్ కళ్యాణ్ పెయింటింగ్ దుకాణంలో తాళం పగలకొట్టి, దొంగతనానికి పాల్పడినట్లు దుబ్బాక ఎస్సై కీర్తిరాజు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గీతన్నల సామాజిక చైతన్య యాత్ర

కొండాపూర్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత సొసైటీలకు, కార్మికులకు ఈత చెట్ల పెంపకానికి భూములను కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం గొల్లపల్లిలో విప్లవ వీరులు సర్వాయిపాపన్న, ఐలమ్మ, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అమరవీరుల యాదిలో గీతన్నల సామాజిక యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు అశన్నగౌడ్, రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈత, తాటి వనాల పెంపకాల సంఘాలకు ఐదు ఎకరాల భూమి, సబ్సిడీ రాయితీలో బోరుబావులు, డ్రిప్ మంజూరు చేయించి, జీవో 560 ప్రకారం గీత కార్మికులను ఆదుకోవాలన్నారు. వృత్తి నివారణకు సేఫ్టీ కిట్లు, పెండిగ్ ఎక్స్‌గ్రేషియా వేంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికుల హక్కులకు కాపాడి అమరులైన విప్లవ కారులను గుర్తుచేసుకుంటూ ఈ చైత్యన్య యాత్రను జిల్లా వ్యాప్తంగా పర్యటించి ఈ నెల 18న సర్వాయి పాపన్న జయంతిన ముగుస్తుందన్నారు.

అనుమానాస్పదస్థితిలో చిన్నారి మృతి

దుబ్బాక, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలో శనివారం చిన్నారి బాలిక (04) అనుమానస్పదస్థితిలో మృతి చెందింది. ఆ చిన్నారిని స్కూల్ యూనిఫాం కోసం స్కూల్‌నుంచి తీసుకుని వచ్చిన తండ్రి, పాపకు అన్నం తినపెట్టి, పడుకోబెటాడు. ఐతే నిద్రలోనుంచి ఒక్కసారిగా పాప లేవడంతో ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకుని వెళాడు. అప్పటికే చిన్నారి మృతి చెందింది. దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి మరణం అనుమానస్పదంగా భావించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కీర్తిరాజు తెలిపారు. చిన్నారి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టానికి తరలించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

జహీరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని విట్టునాయక్‌తండాలో జరిగింది. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విట్టునాయక్‌తండాకు చెందిన సునీల్, కర్ణాటకలోని పాల్యాతండాకు చెందిన ఆశ అలియాస్ సోని(19) ఆర్నెళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. సునీల్ ఆటోడ్రైవర్. కాగా, శుక్రవారం సోని పొలం పనికని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో రాత్రి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతకగా చెట్టుకు ఉరేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సోని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పంచాయతీ కార్యదర్శి బైక్ దహనం

నంగునూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శి ద్విచక్ర వాహనాన్ని శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. రాజగోపాలపేట ఎస్సై వివేక్ తెలిపారు. నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ సెక్రెటరీగా పనిచేస్తున్న ఎండీ గౌసోద్దీన్ విధి నిర్వహణలో భాగంగా తన ద్విచక్ర వాహనం ఏపీ 23 ఆర్ 1196 ను గ్రామంలోని వైకుంఠధామం వద్ద ఏర్పాటుచేసిన నర్సరీ ముందు పార్క్ చేసి పనులు చేయించేందుకు వెళ్లాడు. నర్సరీలో జరుగుతున్న పనులను పరిశీలించి వచ్చేసరికి ద్విచక్ర వాహనం పై పెట్రోల్ పోసి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుంజ దరువు.. ఆదరణ కరువు



- అంతరించిపోతున్న ప్రాచీన వాయిద్యం
- ఇప్పటికీ ఈ కళకు జీవం పోస్తున్న ఏకైక కుటుంబం
- తరతరాలుగా వస్తున్న కళను వదులుకోలేక కొనసాగింపు
- ప్రభుత్వం ప్రోత్సహించాలని వేడుకోలు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన వాయిద్యాల్లో ఒకటిగా రుంజను పరిగణిస్తారు. ఏ ఇతర వాయిద్యాలు లేని కాలంలో పుట్టిన ఈ రుంజకు సరైన ఆదరణ లేకపోవడం వల్ల అంతరించిపోయే దశకు చేరుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కేవలం మెదక్ జిల్లా, చిన్నశంకరంపేట మండలం, రుద్రారం గ్రామంలో ఒకే కుటుంబం ఈ కళను కొనసాగిస్తోంది. తరతరాలుగా వచ్చిన ఈ కళను వదులుకోలేక, ఇతర పనులకు వెళ్లలేక ఈ కళాకారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రుంజకాసురుడి నుంచే రుంజ వాయిద్యం

రుంజ వాయిద్యం పుట్టుక వెనుక ఒక ఆసక్తికరమైన కథనం ఉంది. పెళ్లిళ్లకు వాయిద్యాలు లేకపోవడంతో, శివపార్వతుల వివాహానికి ఒక వాయిద్యం ఉండాలని దేవతలు విశ్వకర్మను కోరారు. అప్పుడు విశ్వకర్మ, లోకంలో అరాచకాలు సృష్టిస్తున్న రుంజకాసురుడు అనే రాక్షసుడిని సంహరించి, అతని కళేబరంతో రుంజ వాయిద్యాన్ని తయారు చేస్తానని చెప్పాడు. 32 ఆయుధాల వల్ల చావు లేకపోవడం , ఒక రక్తపు చుక్క భూమి మీద పడితే వెయ్యిమంది రాక్షసులు పుట్టడం, చనిపోతే ఏడు క్షణాల్లో మళ్లీ బతికే వరాలు రుంజకాసురుడికి ఉన్నాయి. దీని వల్ల అతను దేవతలను హింసించేవాడు. రుంజకాసురుడిని అంతం చేయడానికి, విశ్వకర్మ 33వ ఆయుధమైన చక్రాయుధాన్ని తయారు చేసి, అతనిని సంహరించాడు. ఆ రాక్షసుడి కళేబరంతోనే రుంజ వాయిద్యాన్ని తయారు చేశారని పురాణాలు చెబుతున్నాయి.



మనిషి అవయవాలే రుంజకు..

మనిషి శరీరంలోని అన్ని అవయవాలు రుంజ వాయిద్యంలో ఉంటాయని నమ్మకం. రుంజకాసురుడి కోరలు నాగవాసాలుగా, ప్రేగులు పగ్గాలుగా, నరాలు బొడెళ్లుగా, వేళ్లు పుల్లలుగా, చర్మం మోతగా మారాయి. అందుకే ఈ వాయిద్యానికి రుంజ అని పేరు వచ్చిందని చెబుతారు.

ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు

ఈ అతి ప్రాచీనమైన కళ నాకు మా తాత, తండ్రి యాదగిరిల ద్వారా వంశపారంపర్యంగా వచ్చింది. నాన్న చనిపోయిన తర్వాత కుటుంబాన్ని పోషించడానికి రుంజ వాయిద్యమే ఆధారం అయింది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ మా కళను ఆదరించలేదు. ఈ కళ అంతరించిపోకుండా ఉండాలంటే, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం చాలా అవసరం. రుంజ వాయిద్యం నేర్చుకోవడానికి కనీసం పదేళ్లు పడుతుంది. ఇన్ని సంవత్సరాలు కష్టపడి నేర్చుకున్నా ఆదరణ లేకపోతే, కళాకారుల జీవితాలు వృథా అవతాయి. ప్రభుత్వం ఈ కళను గుర్తించి, ప్రోత్సాహకాలు అందిస్తే, ఆసక్తి ఉన్న యువతకు ఈ వాయిద్యాన్ని నేర్పించి, ఈ ప్రాచీన కళను బతికించవచ్చు.

- కల్లేపల్లి అమర్‌నాథ్, రుంజ కళాకారుడు, రుద్రారం



సైనికుడు ఖలీల్ పాషను సన్మానిస్తున్న మల్కాపూర్ నాయకులు

సైనికుడికి ఘన సన్మానం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దేశ సేవలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకుని తిరిగివచ్చిన వీరసైనికుడు ఖలీల్ పాషాను మల్కాపూర్ గ్రామస్థులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఖలీల్ పాషాకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పారామిలటరి రిటైర్డ్ అధికారి సంగమేశ్వర్, మల్కాపూర్ ప్రజాప్రతినిధి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడలిస్ట్‌లకు ఎస్పీ అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ 2025లో సంగారెడ్డికి చెందిన విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినులను అభినందించి, సన్మానించారు. గడ్డం శృతి (70 కేజీ సీనియర్ విభాగం), గడ్డం స్వాతి (56 కేజీల జూనియర్ విభాగం) అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని గ్రాండ్ మాస్టర్ ఎండీ సాజిద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన వేణుగోపాలకృష్ణ, మాస్టర్లు శ్రీను, అశోక్, అజీజ్, ఏజాజ్, శిరీష, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

కేన్సర్ రహిత దేశంగా భారత్

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేన్సర్ రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక గాంధీ నగర్‌లో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..మెదక్‌లో కేన్సర్ ఆసుపత్రిని నిర్మించేందుకు వెయ్యి గజాల స్థలాన్ని ఇచ్చేందుకు దాత ముందుకు వచ్చారన్నారు. కేంద్ర సర్కార్ రానున్న రోజుల్లో ప్రతి జిల్లాకు ఒక ఆసుపత్రి ఏర్పాటు చేయనుందన్నారు. ఆయన వెంటనే బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు, తదితరులు ఉన్నారు.

‘ఆరోగ్య శిబిరాలపై నిర్లక్ష్యం వద్దు’



వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్యాధికారి

రామాయంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణపై నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సూచించారు. శనివారం ఆయన రామాయంపేట మండల పరిధిలోని ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వలను పరిశీలించారు. మండల వైద్యాధికారిని హరిప్రియ సిబ్బంది ఉన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోహెడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కోహెడ ఎస్సై అభిలాష్ పట్టుకున్నారు. ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 35 ట్రాక్టర్ల ఇసుక డంపులకు ఈనెల 5న బహిరంగ వేలం ఉంటుందని తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.10 వేలు చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

గుడి పేరుతో రాజకీయాలు చేయొద్దు

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మెదక్‌లోని కోదండ రామాలయాన్ని దేవాదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు వచ్చి, హుండీ, ధర్మశాలకు తాళం వేయడాన్ని ఆలయ పరిరక్షణ కమిటీ, హిందూ సంఘాలు, అఖిలపక్ష నాయకులు తీవ్రంగా ఖండించారు. సమాచారం అందుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి పేరుతో రాజకీయాలు చేయవద్దన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూపీఏ నేతలను పాకిస్తాన్ ఏజెంట్లుగా మార్చి హిందువులను టెర్రరిస్టులుగా చూపించిందన్నారు. ఈ సమస్యపై దేవాదాయశాఖ కమిషనర్, రాష్ట్ర మంత్రి ఫోన్‌లో అందుబాటులోకి రాలేదని ఆయన ఆరోపించారు. రామాలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దని డిమాండ్ చేస్తూ ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, సీనియర్ నాయకులు, ఎంఎల్ఎన్ రెడ్డి, సుభాష్‌గౌడ్, లోకేష్, సత్యనారాయణ, శంకర్, సురేష్, మధు, నాగరాజు, ప్రసాద్, సతీష్, శివ, వీణ, సంగీత, ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో

మెదక్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలోని రామాలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయవద్దని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ నాయకులు రామాలయం ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆలయాన్ని తిరిగి ప్రజలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, నాయకులు అంజనేయులు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, జయరాజ్, జీవన్‌రావు, మల్లేశం, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్‌కు ప్రథమ వర్ధంతి

● పిండ ప్రదానాలు చేయాలని బీఆర్ఎస్వీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ కేలండర్‌కు ఆగస్టు 2తో ప్రథమ వర్ధంతి పూర్తయిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మెరుగు మహేష్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నిరుద్యోగులను వంచించిందన్నారు నిరుద్యోగులు ప్రశ్నిస్తే నామమాత్రంగా జాబ్ కేలండర్‌ను విడుదల చేశారన్నారు. ఏడాదిలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. క్యాలెండర్ విడుదలై ఏడాది పూర్తయిన నేపథ్యంలో సీఎం రేవంత్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, కోదండరాం, చిత్రపటాలకు పిండప్రధానం చేసి నిరసనలు తెలుపాలని పిలుపునిచ్చారు. పార్టీ చిన్నకోడూరు మండల అధ్యక్షుడు గుజ్జరాజు, నాయకులు నరేష్, కమల్ యాదవ్, నాయకులు భానుచందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రియురాలితో అసభ్యంగా ప్రవర్తించాడని హత్య

- అప్పటికే ఆమెకు వివాహం.. ఓ పాప
- తనతోనూ సంబంధం పెట్టుకోవాలని వేధింపులు
- విషయం తెలిసి పథకం ప్రకారం హత్య

ములుగు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తనతో వివాహేతర సంబంధం ఉన్న మహిళతో అసభ్యంగా ప్రవర్తించడం, వివాహేతర సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం, చిట్టీల లావాదేవీల్లో గొడవలు వెరసి ఓ ఐకేపీ కంప్యూటర్ ఆపరేటర్‌ను దారుణంగా హత్య చేశారు. గత నెల 28న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గజ్వేల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్సై విజయ్‌కుమార్‌లు శనివారం వివరాలు వెల్లడించారు. ములుగు మండల కేంద్రానికి చెందిన తీగుళ్ల నెహ్రూ (35) ములుగు ఐకేపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నెహ్రూకు వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన గామిలిపురం మహేశ్‌తో కొన్నేళ్లుగా స్నేహం ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే మహేశ్‌తో నెహ్రూ రియల్ ఎస్టేట్, ప్రైవేటు చిట్టీలు నిర్వహిస్తున్నారు. మహేశ్‌కు ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉంది. ఆమెకు వివాహం అయి ఓ పాప కూడా ఉంది. ఈ విషయం నెహ్రూకు తెలుసు. దీంతో సదరు మహిళపై కన్నేసిన నెహ్రూ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం ఆమె మహేశ్‌కు చెప్పింది. అదే క్రమంలో వ్యాపార విషయంలోనూ ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. తన ప్రియురాలితో అసభ్యంగా ప్రవర్తించడంతో కోపం పెంచుకున్న మహేష్.. నెహ్రూను చంపాలని పథకం వేశాడు. గత నెల 28న నగల విషయం మాట్లాడేందుకు రావాలంటు నెహ్రూను తీసుకుని.. మేడ్చల్ సమీపంలో ఉండే మహిళ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య సదరు మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన విషయం చర్చకు రావడంతో నెహ్రూపై మహేశ్ దాడి చేశాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన నెహ్రూ గొంతును వైరుతో నులిమి హత్య చేశాడు. మహిళ, ఆమె తండ్రి సహాయంతో మృతదేహాన్ని మద్దూరు మండలం గాగిళ్లపూర్‌కు కారులో తీసుకువచ్చారు. మృతదేహానికి రాళ్లు కట్టి, అక్కడి చెరువులో పడేశారు. తర్వాత మహేష్ తన స్నేహితుడు ఉబ్బని వినయ్ సహాయంతో నెహ్రూ మొబైల్ నుంచే నెహ్రూ భార్యకు ఫోన్ చేసి.. ‘నెహ్రూ ఈ రోజు రాడు.. రేపు వస్తాడు’ అని చెప్పించాడు. మార్గమధ్యంలో మొబైల్ ఫోన్‌ను కొండపోచమ్మ సాగర్ కెనాల్‌లో పడవేశారు. నమ్మించేందుకు నెహ్రూ ఇంటికి వెళ్లి మహేశ్ రూ. 15వేలు నెహ్రూ భార్యకు ఇచ్చాడు. అయితే, భర్త ఇంటికి రాకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త మహేష్‌తో కలిసి వెళ్లాడని వారికి వివరించింది. దీంతో మహేష్‌ను అదుపులోకి తీసుకోగా, జరిగిన విషయం బయటకు వచ్చింది. అతడు చెప్పిన మేరకు గత నెల 30న గాగిళ్లపూర్ చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనలో మహేశ్‌ను అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళను, ఆమె తండ్రిని, మహేశ్ స్నేహితుడు వినయ్‌లను అరెస్టు చేసి, రెండు కార్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక టీవీఎస్ ఎక్సల్ వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు.

మొక్కలు నాటి.. శ్రమదానం చేసి జనహితం సక్సెస్

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. ఈ పథకాల గురించి కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో వంద శాతం విజయం లక్ష్యం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు వంద శాతం విజయం సాధించేలా కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ సాధించామని, దాని ఫలాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ఆర్థిక సంక్షోభం సృష్టించారని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడె సంగమేశ్వర్, మాజీ మంత్రి చంద్రశేఖర్, నాయకులు కాటా శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, త్రిషా దామోదర్, గిరిదర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి సైబర్ వల

రాయపోల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఓ డ్రోన్ కెమెరా కోసం ఫోన్ చేయగా, సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి బాలుడి నుంచి రూ. రెండున్నర లక్షలు కొట్టేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం సయ్యద్ నగర్‌కు చెందిన అలీబీబీ కూలి పనులు, ఆమె భర్త దుబాయ్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వారికి ఎనిమిదో తరగతి చదివే కొడుకు అజ్మొద్దీన్ ఉన్నాడు. దుబాయ్‌లో ఉన్న అలీ హుస్సేన్ అక్కడ సంపాదించిన డబ్బులను భార్య పేరిట ఉన్న బ్యాంకు ఖాతాకు పంపించేవాడు. ఈ బ్యాంక్ ఖాతాలకు లింక్ అయి ఉన్న ఫోన్‌ను అజ్మొద్దీన్ కూడా వినియోగిస్తాడు. ఆ ఫోన్ నుంచే పేయాప్‌లతో డబ్బులను వివిధ అవసరాలకు వాడేవారు. దీంతో బ్యాంక్ పాస్‌వర్డ్‌లన్నీ బాలుడికి తెలుసు. నాలుగు రోజుల క్రితం అజ్మొద్దీన్ ఇన్‌స్టాలో వీడియోలు చూస్తుండగా, డ్రోన్ కెమెరా అమ్మబడును అని కనిపించింది. కింద కనిపించిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా, డబ్బులు పంపిస్తే కెమెరా పంపిస్తామని అవతలి వ్యక్తి చెప్పాడు. దీంతో అజ్మొద్దీన్ తల్లిదండ్రులకు తెలియకుండా మొదటగా రూ. 50 వేలు పంపించాడు. రెండు రోజుల పాటు మాయమాటలు చెప్పిన సైబర్ నేరస్థులు పలుమార్లు ఫోన్‌పే ద్వారా రూ. రెండున్నర లక్షలు తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఏమవుతుందో అని భయపడ్డ బాలుడు జ్వరం బారిన పడ్డాడు. తల్లి ఆస్పత్రికి తీసుకెళ్లింది. బిల్లు చెల్లించేందుకు తల్లి ప్రయత్నించగా, ఖాతా ఖాళీ అయి ఉంది. కంగారు పడి అజ్మొద్దీన్‌ను ప్రశ్నించగా, జరిగిన విషయం చెప్పాడు. ఈ మేరకు బాధితులు శనివారం రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కంపెనీల మాయాజాలం!

విచ్చలవిడిగా కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపు

- పది రోజుల్లోనే బస్తాపై రూ.150 అధికంగా వసూలు చేస్తున్న వైనం
- కంపెనీల పేర్లు మారుస్తూ జిమ్మిక్కులు
- రైతుల పాలిట గుదిబండలా ఎరువులు
- చేతులెత్తేసిన అధికారులు

కంది, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు బహుళ పోషకాలున్న ఎన్‌పీకే (నత్రజని, బాస్వరం, పోటాషియం) కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేసే కంపెనీల డీలర్లు జిమ్మిక్కుల మీద జిమ్మిక్కులు చేస్తున్నారు. పూటకో కంపెనీ పేరు మారుస్తూ ఎరువులను పీఏసీఎస్‌లకు ఫర్టిలైజర్ షాపులకు సరఫరా చేస్తున్నారు. అంతేగాక ప్రతి 50 కేజీల బస్తాకు రూ.50, రూ.100 చొప్పున పెంచుతూ దండుకుంటున్నారు. కొన్ని నెలలుగా గ్రోమోర్ కంపెనీ చెందిన 20-20 ఎరువులను 50 కేజీల బస్తా 1300లకు విక్రయిస్తే, పది రోజుల క్రితం(జూలై 23)న చంబల్ కంపెనీ పేరుతో దిగుమతి చేసుకున్న 20-20 ఎరువులు ఏకంగా బస్తాకు రూ.100 చొప్పున పెంచేశారు. ఇక శనివారం నర్మదా కంపెనీకి చెందిన 20-20 దిగుమతి చేసుకోగా, బస్తాకు మరో రూ.50 అదనంగా అంటే రూ.1450 ఎమ్మార్పీతో ఉన్నది. ఇక నుంచి బస్తాకు మరో రూ.50 పెంచి అమ్మాలని సూచిస్తున్నారు. పది రోజలు వ్యవధిలోనే రూ.1300 ఉన్న కాంప్లెక్స్ ఎరువులు ఒక్కసారిగా బస్తాకు రూ150 పెరిగి ఇప్పుడు రూ1450 చేరింది. ఇదేమీ అర్థం కాని అన్నదాతలు పది రోజుల వ్యవధిలో ఒక బస్తాకు రూ. 150 పెరగడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక అప్పులు చేసి మరీ అధికధరలకు ఎరువులను కొంటున్నారు. ఈ విషయమై శనివారం జిల్లా వ్యవసాయ అధికారులను వివరణ కోరితే రేటు విషయంలో తుది నిర్ణయం కంపెనీలదేనని, అది కూడా కేంద్రం చేతుల్లో ఉంటుందని తెలిపారు.



పాత రేటును అంగీకరించని పీఓఎస్

కంది పీఏసీఎస్‌లో పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్‌లో ఎరువుల కొనుగోలు చేసే రైతుల ఆధార్ కార్డు నెంబరు, ధర ప్రభుత్వమే నిర్ణయించి ఆన్‌లైన్ ద్వారా సూచిస్తుంది. శనివారం పీఏసీఎస్ సిబ్బంది 20-20 కాంప్లెక్స్ ఎరువుల ధరను రూ.1400 బస్తా చొప్పున నమోదు చేస్తే అది నమోదు చేసుకోలేదు. రూ.1450 లెక్కన నమోదు చేస్తేనే సక్సెస్ అయ్యి నమోదు అవుతుండడం గమనార్హం. దీంతో పీఏసీఎస్ నిర్వహకులు బస్తాకు రూ.50 రూపాయలు అదనంగా భరించి రూ.1400లకు 20-20 విక్రయించారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయియించాలని సూచిస్తున్నారు.

1800 మెట్రిక్ టన్నుల ఎరువులు ..

కంది మండలంలో మొత్తం 19 వేల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతుండగా, 1800 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. కంది మండలంలోని పీఏసీఎస్, కాశీపూర్‌లోని రెండు ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులు, బేగంపేటలో ఒక ఫర్టిలైజర్ షాప్ ద్వారా మొత్తం 800 మెట్రిక్ టన్నుల యూరియా, 150 మెట్రిక్ టన్నుల డీఏపీ, 350 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను మాత్రమే అమ్ముతున్నారు. మిగతా ఎరువులను హైదరాబాద్, సంగారెడ్డి టౌన్, పటాన్‌చెరు, శంకర్‌పల్లి, సదాశివపేటల నుంచి రైతులు తెచ్చుకుంటున్నట్లు సమాచారం.

అప్పుల పాలవుతున్నాం..



పంటల దిగుబడికి కాంప్లెక్స్ ఎరువులు ఎంతో అవసరం. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కంపెనీల యజమానులు ఇష్టారాజ్యంగా రేట్లు పెంచి దోచుకుంటున్నారు. తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేసి అప్పులపాలవుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలి.

-బండి వీరారెడ్డి, రైతు, కంది

వారానికోసారి పెంచుతున్నారు..



పాత ధరలకు దొరికే గ్రోమోర్ కంపెనీ 20-20 ఎందుకు సరఫరా కావడం లేదు. కొత్త కంపెనీల పేరుతో వారానికోసారి రేట్లు పెంచుతున్నారు. పది రోజుల వ్యవధిలో బస్తాకు రూ.150 పెంచడం సరికాదు. అధికారులు రేట్లు అదుపులోకి తెచ్చి రైతులకు అండగా నిలువాలి.

-బానోత్ కుమార్, గొల్లగూడతండా

ధర నిర్ణయం మా చేతుల్లో లేదు

కాంప్లెక్స్ ఎరువుల రేట్లు పెంపకం కేంద్రం చేతిలోనే ఉంటుంది. కొన్ని కంపెనీలకు అవసరానికి అనుగుణంగా ధరలు పెంచుకునేలా 8 ఏళ్ల క్రితమే కేంద్రం అవకాశమిచ్చింది. బహుళ జాతి పోషకాలున్న కాంప్లెక్స్ ఎరువుల్లో వాడే ముడి సరుకులు, మార్కెట్లో దొరికే రేట్లను బట్టి ఒక్కో కంపెనీ ఒక్కో ధరకు ఎరువులను విక్రయిస్తుంది.

-శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

న్యూస్ బాక్స్

ఆకునూరులో కంటి వైద్యశిబిరం

చేర్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆకునూరు గ్రామంలో శనివారం ఆద్య కంటి ఆస్పత్రి వైద్యబృందం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటివైద్యులు మాధవి, బాలకిషన్ సుమారు 80మందికి కంటివైద్యపరీక్షలు జరిపారు. 25మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించి ముగ్గురి కాటరాక్ట్ ఆపరేషన్ జరిపారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

మద్దూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌కు పది, ఇంటర్ అడ్మిషన్స్ గడువును ఈ నెల 18 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు కోఆర్డినేటర్ వరదరాజు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ బాకీ చంద్రభాను తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్‌స్కూల్ సొసైటీలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు ఈ నెల 18వరకు పొడిగించినట్లు తెలిపారు.

రైతుల ఖాతాలోకి కిసాన్‌సమ్మాన్ నిధి

జగదేవ్‌పూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతుల ఖాతాలోకి పీఎం కిసాన్ మ్మాన్ నిధి 20వ విడత నిధులను ప్రభుత్వం రైతుల ఖాతాలో నేరుగా డీబీటీ ద్వారా జమ చేస్తుందని ఏవో వసంతరావు పేర్కొన్నారు. శనివారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత నిధులను ప్రధాని నరేంద్రమోడీ విడుదల చేసిన నేపథ్యంలో మండలంలోని జగదేవ్‌పూర్, మునిగడప, తిమ్మాపూర్, తిగుల్, చాట్లపల్లి రైతు వేదికల్లో వ్యవసాయానికి ప్రాధాన్యత పై ప్రధాని మోదీ సందేశాన్ని దృశ్య శ్రావణం ద్వారా ప్రత్యక్షంగా రైతులు వీక్షించారు.

పేద కుటుంబాలకు చేయూత

కొండపాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పలు సేవా కార్యక్రమాలు అందిస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ఖమ్మంపల్లి మంద భూమవ్వాలక్ష్మారెడ్డి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిని పలువురు అభినందించారు. శనివారం గ్రామంలో ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెళ్లిళ్లు చేసిన 11 పేద కుటుంబాల వారికి, మృతి చెందిన మూడు కుటుంబాలవారి సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి, బీఆర్ఎస్ నాయకుడు మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బస్టాండ్ పనులను పూర్తి చేయరా?

గజ్వేల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 20 నెలలైనా బస్టాండ్‌ను పూర్తి చేయని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లో నిర్మాణంలో ఉన్న బస్టాండ్‌ను ఆయన శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.180 కోట్లను మంజూరు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేశారన్నారు. రద్దు చేసిన పనుల్లో గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌లతో పాటు పెండింగ్‌లో ఉన్న రింగ్‌రోడ్డు, కాలువలు, ఫంక్షన్‌హాల్స్, రోడ్లు ఉన్నాయన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడంతో పాటు పెండింగ్ పనులను పూర్తి చేయాలని, మరో రూ.500 కోట్లను గజ్వేల్ అభివృద్ధికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న నామకరణం చేయాలి

చేర్యాల/కొమురవెల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న నామకరణం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి పేర్కొన్నారు. కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామంలో శనివారం అమరుల యాదిలో సామాజిక చైతన్యయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామకు సర్దార్ సర్వాయిపాపన్న పేరు పెడతామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సభలో హామీ ఇచ్చినా నెరవేర్చకపోవడం తగదన్నారు. గీతకార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు సామాజిక చైతన్యయాత్ర నిర్వహిస్తున్నామన్నారు.అదేవిధంగా కొమురవెల్లి మండలకేంద్రంలోని పోలీస్ బొమ్మ చౌరస్తాలో రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి కేజీకెఎస్ జెండా ఆవిష్కరించి అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర ర్యాలీ తీశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చింతమడక విద్యార్థులు

సిద్దిపేట రూరల్,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో చింతమడక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో కొత్తపల్లి రాజిరెడ్డి తెలిపారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సిద్దిపేటలో అండర్-14 బాలికల విభాగంలో గీతిక బంగారు పతకం, జెల్ల అవంతిక, బద్దం అర్చన వెండి పతకాలు గెలుచుకున్నట్లు తెలిపారు. అండర్ -14 బాలుర విభాగంలో రేశ్వంత్ బంగారు పతకం, వట్టిపల్లి విసీల్ రెడ్డి వెండి పతకం సాధించి ఈ నెల 3,4 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

నూతన భవనం పనులు పూర్తయినా

ప్రారంభానికి నోచుకోని పాఠశాల

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మిగిలిపోయిన చిన్న పనుల్లో తీవ్ర జాప్యం
- కొమురవెల్లిలో అరకొర వసతుల మధ్యే పాతభవనంలో కొనసాగుతున్న ఉన్నత పాఠశాల
- పనులు పూర్తయితే 'పీఎంశ్రీ' కింద విద్యార్థులకు అందుబాటులోకి రానున్న కంప్యూటర్ విద్య





కొమురవెల్లి ఉన్నత పాఠశాల నూతన భవనం, తరగతి గదుల్లో పూర్తికాని ఫ్లోరింగ్ పనులు

కొమురవెల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పరిస్థితి దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదు అన్న చందంగా తయారైంది. విద్యార్థుల కోసం ప్రభుత్వం నూతన భవనాన్ని నిర్మించినప్పటికీ అవసరమైన చిన్న చిన్న పనులు పూర్తి కాక ప్రారంభానికి నోచుకొని పరిస్థితి నెలకొన్నది. దీంతో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుకోలేకపోతున్నారు.

ఆగుతూ...సాగుతున్న పనులు

పాఠశాల భవన నిర్మాణం పూర్తయినప్పటికీ, ఇంకా గదులలో ఫ్లోరింగ్ పనులు, ఎలక్ట్రిసిటీ పనులు, కుళాయిల బిగింపు పనులు పూర్తి కాకపోవడంతో పాత గదులలోనే తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అరకొర వసతుల మధ్య ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికి అమ్మ ఆదర్శకమిటీ నిధులు రూ.28 లక్షలు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు రూ.15 లక్షల బిల్లులు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మిగిలిన పనులు ఆలస్యమవుతున్నాయి. త్వరగా పనులు పూర్తి చేస్తే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇక్కట్లు తొలగనున్నాయి.

'పీఎంశ్రీ'కి ఎంపికైనా..

దాదాపు 228 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల 2024-25 విద్యా సంవత్సరంలో పీఎంశ్రీ పాఠశాలకు సైతం ఎంపికైంది. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తులో పాఠశాల భవనం నిర్మాణం పూర్తయినా, విద్యుత్, ఫ్లోరింగ్ పనులు పూర్తికాకపోవడంతో పీఎం శ్రీ పాఠశాలలో లభించే సౌకర్యాలు కంప్యూటర్ ల్యాబ్, సంగీతం తరగతులు, సైన్స్ ల్యాబ్, ఎలక్ట్రానిక్ రిపేరింగ్ ల్యాబ్‌లాంటి వాటిని విద్యార్థులు అందుకోలేకపోతున్నారు. పీఎంశ్రీ పాఠశాల కింద కంప్యూటర్లు, ఇతర పరికరాలు పాఠశాలకు చేరుకున్నా సరియైన భవనం లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఫలితంగా విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాధికారి, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనంలో పనులను పర్యవేక్షించి మిగతా పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



పాఠశాలలో విద్యార్థులు విద్యను చక్కగా అభ్యసిస్తున్నారు. నూతన భవనంలో మిగిలిపోయిన పనులు పూర్తయితే విద్యార్థులకు పీఎంశ్రీ పాఠశాల సేవలు లభించనున్నాయి. మిగిలిన పనులు పూర్తిచేయాలంటూ కాంట్రాక్టర్‌కు చాలాసార్లు చెప్పాం. అయినా పనుల్లో పురోగతి లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

- బొమ్మగోని రమేష్, ఎంఈవో

నవజాత శిశువులకు తల్లిపాలు శ్రేయస్కరం



సిద్దిపేటలో తల్లిపాలవారోత్సవాల్లో గర్భిణులు, బాలింతలతో అంగన్‌వాడీ టీచర్లు



చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమాదేవి

సిద్దిపేట అర్బన్/చేర్యాల/మిరుదొడ్డి/మద్దూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. నవజాత శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని పేర్కొన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలను తాగించడం ద్వారా రోగనిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. సిద్దిపేటలోని 1,2,3,4,9 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, నాగలక్ష్మి, స్వర్ణలత, లత, భవాని, వనిత, శైలజ తదితరులు పాల్గొన్నారు. చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి సందర్శించి బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత పట్ల అవగాహన కల్పించారు. తల్లిపాలతో తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, శోభ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. దూళిమిట్ట మండలంలోని తోర్నాల అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు 6 మాసాల వరకు తల్లిపాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రవీణ్, టీచర్ గౌతమి, ఏఎన్‌ఎం రమ్య, ఆశాలు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

నేటి నుంచి శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం

దుబ్బాక, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆదివారం పుణ్యాహావాచనం, అంకురార్పణతో మొదలయ్యే పూజా కార్యక్రమాలు, సోమవారం శాంతిపాఠం, యాగశాల ప్రవేశం, ద్వాదశ కలశారాధన, అగ్నిప్రతిష్ఠ ధ్వజారోహణం కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే మంగళవారం వివిధ పూజా కార్యక్రమాలతోపాటు బుధవారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గురువారం వివిధ వైదిక కార్యక్రమాలు జరుపుతారు. 4రోజుల పాటు సాగే ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సురభిలో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

సిద్దిపేటఅర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లిలో గల సురభి వైద్య కళాశాల అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దీప్తిరావు పేర్కొన్నారు. శనివారం ఆస్పత్రిలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవల్లో భాగంగా మొదటిసారిగా వెన్నుపూస డిస్క్ ఆపరేషన్ చేసినట్టు తెలిపారు. న్యూరో సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ హాజి జహీర్ అబ్బాస్ నేతృత్వంలో నాగవ్వ, మమతకు వెన్నుపూస డిస్క్ ఆపరేషన్ నిర్వహించినట్టు తెలిపారు. న్యూరో సర్జరీ సేవలతో పాటు గుండె, కిడ్నీ, డయాలసిస్, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ సేవలు సైతం అందుబాటులో ఉన్నాయని, ఈ వైద్య సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సురభి వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ హరీందర్ రావు సహకారంతో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. సర్జరీ నిర్వహించిన డాక్టర్లకు, నర్సింగ్ సిబ్బందికి, టెక్నీషియన్లకు అభినందనలు తెలిపారు.

పలు ఆలయాల్లో మాజీమంత్రి హరీశ్‌రావు పూజలు



సిద్దిపేటలోని శ్రీసంతోషిమాత ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమంలో హరీశ్ రావు, భక్తులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పటేల్‌పురలోని శ్రీ సంతోషి మాత ఆలయ 33వ వార్షికోత్సవాల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని దర్శించుకొని పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ ఆలయంలో అమ్మవారిని హరీశ్‌రావు దర్శించుకున్నారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రావణమాస ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో నిర్మిస్తున్న అన్నదాన సత్ర నిర్మాణ పనులను పరిశీలించారు. భవనానికి అవసరమైన గ్రానైట్‌ను విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నంగునూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను శనివారం మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. మండలంలోని అంక్షాపూర్ గ్రామ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రుక్మా రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యం తో మృతి చెందింది, మగ్దుంపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త బండి సాయిలు తల్లి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే సిద్దన్న పేట గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కత్తుల శంకర్ రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని ఓదార్చారు. వెంట మండల పార్టీ అధ్యక్షుడు లింగం గౌడ్, నాయకులు ఉన్నారు.

మురికికాలువలను శుభ్రంగా ఉంచాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని 14వ వార్డులో మురికి కాలువలో నీరు నిలిచి సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదు రావడంతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువల్లో సిల్ట్ తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా పారిశుధ్య మున్సిపల్ సంబంధిత సమస్యలున్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. వెంట అధికారులు ప్రవీణ్, బరద్వాజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సిద్దిపేట బాలికోన్నత పాఠశాలలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 5న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో నిర్వహించ తలపెట్టి ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలంటూ పలు డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మనోహర్, యూఎస్‌పీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- **రాయపోల్:** ప్రభుత్వం చేపట్టిన అక్రమ డిప్యూటేషన్‌లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన టీపీటీఎఫ్ సభ్యత్వ సేకరణలో భాగంగా రాయపోల్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కనకయ్య, కరుణాకర్, మెట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు



చిన్నకోడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్ సందర్శనకు వచ్చిన పర్యాటకులు ఎవరు కూడా నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్ఐ సైఫ్ అలీ సూచించారు. రక్షణ చర్యలలో భాగంగా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ వద్ద శనివారం హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి, సిద్దిపేట జిల్లా మంత్రులను, కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మండిపడ్డారు. శనివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వార్డులను సమానంగా చూస్తామని, పట్టణంలో వార్డుల్లో ఉన్న సమస్యలను నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో, ఇన్‌చార్జి మంత్రి వివేక్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు వచ్చేందుకు కృషిచేస్తామన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డులకు మున్సిపల్ నిధులు కేటాయించుకుంటూ, కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డులకు వచ్చేసరికి ప్రభుత్వ నిధులు తెచ్చుకోవాలని చెప్పడం సబబు కాదన్నారు. మున్సిపల్‌లో అవినీతికి పాల్పడుతున్నారని స్వయంగా మీ కౌన్సిలర్లు చెబుతున్నారని, దీనిపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులపై మున్సిపల్ వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు చేసిన వ్యాఖ్యలన్నీ అబద్ధాలని మండిపడ్డారు. త్వరలోనే పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి నిధులు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గాయాజుద్దీన్, అర్షద్, బాబా, ఫయాజ్, నికిల్, చోటు, గణేష్ శివ, వర్షిత్, స్నేహిత్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే



సిద్దిపేట భారత్‌నగర్‌లోని శ్రీవాణి స్కూల్‌లో శనివారం ఫ్రెండ్‌షిప్ డేను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని తమ అనుబంధాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ సత్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి)

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నూరు గ్రామ శివారులో శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. లద్నూరు గ్రామానికి చెందిన మహేందర్ మద్దూరులోని ఎస్సీ హాస్టల్‌లో కుక్కర్‌గా పని చేస్తున్నారు. శనివారం పనులు ముగించుకుని లద్నూరుకు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో జనగామ జిల్లా నర్మెట్ట మండలానికి చెందిన కిరణ్ తన ద్విచక్రవాహనంపై మద్దూరుకు వస్తున్న క్రమంలో ఇరువురి బైక్‌లు ప్రమాదవశాత్తుగా ఢీకొన్నాయి. కిరణ్‌కు చేయి విరగగా, మహేందర్‌కు రెండు కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను వెంటనే 108 సిబ్బంది జనగామలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్‌నెస్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వీక్లీ పరేడ్ ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు, ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడుతుందని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దకోడూరు శివారులోని సీపీఆర్ హెడ్ క్వార్టర్‌లో శనివారం జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. వీక్లీ పరేడ్‌కు ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ హాజరై సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్, స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనని పరిశీలించారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ధరణికుమార్, కార్తీక్, పూర్ణచందర్, ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ఉపేందర్, ప్రవీణ్‌కుమార్, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు రాక ఖాళీ బిందెలతో నిరసన



మిరుదొడ్డిలో ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మిరుదొడ్డి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):గత రెండురోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు సంబంధిత అధికారులపై మండిపడ్డారు. శనివారం మిరుదొడ్డిలో నీరురాకపోవడంతో ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. రెండురోజులుగా భగీరథ నీళ్లు రాకపోవడం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండని అధికారులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా మంచినీటి గోస తీర్చాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ కళాశాలలో పీసీరాయ్ జన్మదిన వేడుకలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఫాదర్ ఆఫ్ ఇండియన్ కెమిస్ట్రీ, ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్ జన్మదినం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'రసాయనశాస్త్ర ప్రాముఖ్యత, ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రాజ్‌గోపాల్‌శర్మ రిసోర్స్‌పర్సన్‌గా హాజరయ్యారు. విద్యార్థులతో వారు మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో ఫార్మా, మెడిసిన్, నానో టెక్నాలజీ, పెట్రో కెమికల్స్, గ్రీన్ కెమిస్ట్రీ, ఫుడ్‌సైన్స్, కాస్మెటిక్స్, రక్షణ, వివిధ రంగాల్లో కెమిస్ట్రీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఇన్చార్జి డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ డాక్టర్ ఎం శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ డా. అయోధ్య రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

సిద్దిపేట కల్చరల్/బెజ్జంకి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల వాడకం వల్ల వచ్చే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనల పట్ల సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్, స్టూడెంట్ కౌన్సెలింగ్ అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ హాజరై విద్యార్థులకు డ్రగ్స్ వల్ల సమాజంలో జరుగుతున్న దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, ట్రాఫిక్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని బేగంపేట ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సౌజన్య సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కోమటిచెరువు కళావిహీనం

(5వ పేజీ తరువాయి)



కాలిపోయిన పవర్ కంట్రోల్ యూనిట్ ఇదే

పడడంతో ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. పవర్ కంట్రోల్ పరికరాలు కాలిపోవడంతో మ్యూజికల్ ఫౌంటెన్, డైనోసార్ పార్కుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హైదరాబాద్‌లోని టూరిజం శాఖకు పరికరాల కోసం పంపిన ఇండెంట్ ఇంకా చేరకపోవడంతో ఇవి నిరుపయోగంగా ఉన్నాయి.

చెరువులో చెత్త, మందుబాబుల అడ్డాగా...

చెరువులో అందంగా కనిపించేందుకు సిబ్బంది కొమ్మలు నరికి చెరువులోనే పడేయడంతో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీంతోపాటు రాత్రి పూట పోలీసుల గస్తీ, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో కోమటిచెరువు మందుబాబుల అడ్డాగా మారింది. ప్రజల డబ్బుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన కోమటిచెరువును వెంటనే అధికారులు పట్టించుకొని, పాడైపోయిన పరికరాలను మార్చి, అన్ని సదుపాయాలను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

వాటర్ హీట్

(5వ పేజీ తరువాయి)

మండిపడ్డారు. అక్కడక్కడా చిన్నచిన్నగా మిగిలిపోయిన పనులను చేయించిన కాంగ్రెస్ నాయకులు తామే చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

మరోవైపు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కోమటిబండలోని జీఎల్‌బీఆర్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 433 ద్వారా రూ.210 కోట్లు కేటాయించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టారని ఆయన పేర్కొన్నారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి మొదలు పెట్టిన పథకాన్ని కేసీఆర్ సొంతం చేసుకున్నారని, ఇప్పుడు గజ్వేల్‌కు పట్టిన శనిలా ఆయన మారారని నర్సారెడ్డి విమర్శించారు. ఇంతకాలం మల్లన్నసాగర్ నీటిని హరీశ్‌రావు సిద్దిపేటకు తరలించుకుపోగా, ఇక్కడి నాయకులు ఆయనకు తాబేదార్లుగా మారారని ఆరోపించారు. తాగునీరు, విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుండి పరిష్కరిస్తుందన్నారు.

వివాదానికి కారణాలు

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేసి తానే చేశానని చెప్పుకున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనికి భిన్నంగా, కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి క్రెడిట్ పొందేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. మొత్తానికి, తాగునీటి సమస్య పరిష్కారం విషయంలో ఇరు పార్టీలు పరస్పరం ఆరోపణలు, విమర్శలు చేసుకుంటూ క్షీరాభిషేకాలు నిర్వహించడం గజ్వేల్‌లో చర్చనీయాంశంగా మారింది.